# 'మీ నిజతత్త్వాన్ని నిరూపించేందుకే నేను వచ్చాను'

**బ్రహ్మ దర్శన భాగ్యంబు బడయగోరి**
**వెదుకబోవుదు వెచటికె వెఱ్ఱిమనస?**
**అదియు నీలోన నున్నది అరయుమచట**
**సత్యమును తెల్పు మాట ఈ సాయిమాట**

ప్రేమస్వరూపులారా! దైవము మీకంటే వేరుగా ఉన్నాడని భ్రమించి, మీరు దైవదర్శనముకోసం అనేకవిధములుగా వెతుకుతున్నారు; జపములు, ధ్యానములు, భజనలు, సంకీర్తనలు ఇత్యాది అనేక సాధనలు సల్పుతున్నారు. అయితే, దివ్యత్వము బయట వెతికితే చిక్కేది కాదు. అది మీలోనే ఉన్నది. కాబట్టి, దృష్టిని అంతర్ముఖము గావించుకొని దైవత్వాన్ని మీలోనే దర్శించడానికి తగిన కృషిచేయండి.

బళ్ళారీ మున్సిపల్ ఛైర్మన్ రామరాజు మమ్మల్ని హంపీలోని విరూపాక్షాలయానికి తీసుకు వెళ్ళాడు (1940 అక్టోబరులో). అక్కడికి వెళ్ళిన తరువాత నేను లోపలికి రానని పట్టుబట్టాను. అప్పుడు శేషమరాజు (అన్నగారు), "మేము లోపలికి వెళ్ళి విరూపాక్షుని దర్శించుకొని వస్తాము. నీవు ఇక్కడే మన సామాను దగ్గర ఉండు", అని చెప్పాడు. వాళ్ళు ఆలయంలోకి వెళ్ళారు. అయితే, కర్పూరహారతి ఇచ్చే సమయంలో వాళ్ళకి గర్భగుడిలో విరూపాక్షునికి బదులు 'సత్యం' కనిపించాడు! శేషమరాజుకు కోపం వచ్చింది. "బయట సామానుదగ్గర కూర్చొమ్మని చెబితే వీడు ఇక్కడికెందుకు వచ్చాడు? గర్భగుడిలో ప్రవేశించడం తప్పు కదా," అనుకొని బయటికి వచ్చి చూశాడు. 'సత్యం' బయటే కూర్చొని ఉన్నాడు! తాను మళ్ళీ లోపలికి వెళ్ళి చూశాడు. 'సత్యం' అక్కడకూడా ఉన్నాడు! ఇంకా ఆయన అనుమానం తీరలేదు. భార్యతో, "నీవు బయటికి వెళ్ళి 'సత్యం'దగ్గర కాపలా ఉండు.

sri sathyasai vahini amrutam

వాడిని ఎక్కడికీ కదలనివ్వకు," అని చెప్పి తాను మళ్ళీ లోపలికి వెళ్ళాడు. 'సత్యం' లోపలా కనిపిస్తున్నాడు, బయటా కనిపిస్తున్నాడు! శేషమరాజుకు ఆశ్చర్యం కలిగింది. 'ఇది కలా, నిజమా లేక, నా భ్రమనా' అనుకున్నాడు. రామరాజుకూడా ఇదంతా ప్రత్యక్షంగా చూశాడు.

బళ్ళారినుండి ఉరవకొండకు తిరిగి వచ్చేటప్పుడు మున్సిపల్ ఛైర్మన్ ఒక బంగారు కాలరుపిన్ను తెచ్చి నా కాలరుకు వేశాడు. కాలరుపిన్ను వేసుకోవడం ఆనాటి ఫ్యాషను. నేను వద్దన్నాను. అప్పుడు శేషమరాజు, "ఆయన ఎంతో ప్రేమతో ఇచ్చారు. దానిని తిరస్కరిస్తే ఆయనను నీవు అగౌరవపరచినట్లవుతుంది," అన్నాడు. ఆయన బలవంతంమీద ఆ కాలరుపిన్ను వేసుకున్నాను. ఉరవకొండకు తిరిగివచ్చిన తరువాత నేను స్కూలుకు వెళుతుంటే ఆ పిన్ను జారిపడిపోయింది. అయితే, పిన్ను పోయిందని నేనేమాత్రం విచారించలేదు. కాని, అక్కడేదో వెతుకుతున్నట్లు నటించాను. వెనుక వస్తున్న విద్యార్థులు, "రాజూ! ఏమి వెతుకుతున్నావు?" అని అడిగారు. "మీరు చూశారు కదా, కాలరుపిన్ను. ఇప్పుడా పిన్ను కనిపించడం లేదు. దాని నిమిత్తమై వెతుకుతున్నాను," అని చెప్పాను. ఆ పిల్లలుకూడా వెతకడం ప్రారంభించారు. అప్పుడు నేను నవ్వుతూ, "పిచ్చి విద్యార్థులారా! మీరు విద్యనభ్యసించే నిమిత్తం స్కూలుకి వెళుతున్నారు. పిన్ను విషయం మీ కెందుకు?" అన్నాను. "రాజూ, అది నీవు వేసుకుంటే చాలా బాగా కనిపించింది," అన్నాడొకడు. ఇంతలో మరో పిల్లవాడు ఇంటికి పరుగెత్తుకొని వెళ్ళి ఈవిషయం చెప్పాడు. ఇంట్లో శేషమరాజు, రామరాజు ఇరువురూ మాట్లాడుకుంటున్నారు. "సత్యం చేసే పనులన్నీ చాలా చిత్రవిచిత్రంగా ఉంటున్నాయి. అతని ప్రవర్తనను మనం ఎలా అర్థం చేసుకోవాలి?" అని చర్చించుకుంటున్నారు. ఆ విద్యార్థి చెప్పిన మాటలు విని వెంటనే ఇద్దరూ బయల్దేరివచ్చారు. రామరాజు ఆప్యాయంగా నా భుజంపై చేయివేసి, "రాజూ! ఏమి వెతుకుతున్నావు?" అని అడిగాడు. నేను చాలా అమాయకంగా, "దేనికోసమో వెతుకుతున్నాను," అని చెప్పాను. "దేనికోసమో తెలియకుండా వెతకడమనేది ఈ జగత్తులో జరుగుతుందా?" అని ప్రశ్నించాడు. "నిన్న మీరు తగిలించిన పిన్ను ఇప్పుడు కనిపించడం లేదు," అన్నాను. "అది పోతే పోయింది. ఇంకా పది పిన్నులు ఇస్తాను. ఇంటికి పోదాం పద," అన్నాడు.

srisathyasaivachanamrutam

అక్టోబరు ఆదివారము ఇరువది తేదీ
హంపినుండి వచ్చి స్కూలు కరుగుచు బాబా
కాలరుపిన్నొకటి జారి కనబడలేదు
మార్పు కలిగెను నాడు
ప్రాపంచిక సంబంధము పిన్నై తొలగెన్
క్షేత్రదర్శనము కూడా చెల్లెను హంపిన్
మాయ తొలగెనని బాబా గృహమును వీడెన్

మానవునికి రెండు విధములైన కోరికలుంటాయి. ఒకటి ప్రాపంచిక సంబంధమైన విషయవాసన. రెండవది పారమార్థిక సంబంధమైన దైవచింతన. "ఇహమున సుఖింప హేమతారకవిద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య." కాని, ప్రజలు ప్రాపంచిక సంబంధమైన కోరికలనే ప్రధానంగా తీసుకుంటారు. "ప్రాపంచిక సంబంధము పిన్నై తొలగెన్..." ఈ ప్రాపంచిక సంబంధము నాకొక పిన్నుతో సమానం. అది తొలగిపోయింది. కాబట్టి, ఇక నేను ఇంటికి రానన్నాను. ఈలోపల అక్కడ అనేకమంది గుమికూడారు. అక్కడ హెచ్.ఎస్. వెంకటరమణ అనే టీచరు ఉండేవాడు. నన్ను ఆయన ఇంటికి తీసుకువెళ్ళారు. "నీవు దైవంకోసం వెతుకుతున్నావా? లేక, పిన్నుకోసం వెతుకుతున్నావా?" అని అడిగారు. "దైవం కోసం వెతకనక్కర్లేదు. ఎందు చూసిన అందే ఉన్నాడు. పిన్ను నాకవసరం లేదు. ఏది కావలసినా అన్నీ నా చేతిలోనే ఉన్నాయి," అని చెప్పాను. అప్పుడు రామరాజు, "దేవుడు ఎక్కడున్నాడు? మేము చూడగలమా?" అని అడిగాడు. అంతకుపూర్వం ఆయనకి ఒక ఉంగరం ఇచ్చాను. అది ఆయన చేతినుండి అదృశ్యమై నా చేతిలోకి వచ్చింది. ఆయన ఆశ్చర్యపోయాడు. "నా చేతికి ఉన్నది నీ చేతిలోకి ఎట్లా వచ్చింది?" అని అడిగాడు. "అన్నీ నాచేతిలోనే ఉన్నాయి," అని చెప్పాను.

*(శ్రీవారు తమ దివ్యహస్తచాలనముచే ఆ ఉంగరమును సృష్టించి అందరికీ చూపించారు)*

ఇదంతా చూసి శేషమరాజు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. నేను రామరాజు చేయి పట్టుకొని, "ఇదేమిటి?" అని అడిగాను. "నా చెయ్యి" అని చెప్పాడు. ఆయన జేబులోనుండి పెన్ను తీసి, "ఈ పెన్ను ఎవరిది?" అని అడిగాను. "నాది" అన్నాడు. "నా చెయ్యి, నా పెన్ను,

sri sathyasai vachanamrutam

నా దేహము, నా మనస్సు, నా ఇంద్రియాలు, నా అంతఃకరణ అని చెబుతున్నావు. ఇవన్నీ నీవి అయినప్పుడు మరి నీవెవరు? వీటికంటే నీవు ప్రత్యేకంగా ఉన్నప్పుడే ఇవి నీవి అవుతాయి కదా!" అన్నాను. ఈ మాటలు విని అందరూ యోచన చేస్తూ వచ్చారు; "రాజు సత్యమే చెబుతున్నాడు. 'ఇది నాది, అది నాది' అంటున్నాముకాని, మేమెవరో మాకు తెలియడం లేదు," అన్నారు. "దానిని గుర్తింపజేసే నిమిత్తమే నేను వచ్చాను," అని చెప్పాను.

"చూసేది నేత్రము. తలచేది మనస్సు. ఈ కర్చీఫ్‌ను కన్ను చూస్తున్నది. ఐతే, ఇది కర్చీఫ్ అని చెప్పడానికి ఒక ఆధారము ఉండాలి కదా! ఇది ఉంగరమని చెబుతున్నావు. ఈ సంగతి నీకెట్లా తెలిసింది? దీనిని మనస్సుద్వారా తెలుసుకున్నా నంటావు. ఈ మనస్సు ఎక్కడినుండి వచ్చింది? అది నీకు తెలియడం లేదు. తెలియనిదానిని నీవు తెలుసునని భావిస్తున్నావు. ఆ తెలియనటువంటిది ఏదో అదే నీవు," అని చెప్పాను.

ఆనాటినుండి అనేకమంది సాధకులు, ఆధ్యాత్మిక దృష్టితో విచారణ చేసేవారు నావద్దకు రాసాగినారు. "రాజు చెప్పేది నిజమే. కాని, మన నిజతత్త్వమును మనం గుర్తించేదెలా?" అని వారిలో వారు తర్కించుకుంటూ వచ్చారు. వాళ్ళు వేదాంత మంతా చెప్తూవచ్చారు గాని, వాళ్ళు చెప్పే విషయాలు వారికే అర్థం కాలేదు. "ఈ ఉంగరము నాది, ఈ దేహము నాది, ఈ కర్చీఫ్ నాది అంటున్నావు. కాని, 'నేను' ఎవరో తెలుసుకోవడం లేదు. దానిని గుర్తించడానికి ప్రయత్నించాలి. దృశ్య కల్పితమైనవన్నీ ఏదో ఒకనాటికి అదృశ్యమైపోతాయి. కంటికి కనిపించేది దృశ్యము. చూసేవాడు ద్రష్ట. 'యద్దృశ్యం తన్నశ్యం', ఏది కంటికి కనిపిస్తున్నదో అదంతా నశించిపోయేదే! కంటికి కనిపించే దృశ్యం భ్రమయేగాని, సత్యం కాదు.

హెచ్.ఎస్. వెంకటరమణ మంచిగుణము కలవాడు. నేను ఆయన ఇంటి ముందునుండే స్కూలుకి పోయేవాడిని. ఆయన ఇంటి అరుగుపై కూర్చొని నాకోసం ఎదురు చూసేవాడు. నన్ను చూసిన తక్షణమే, 'రాజూ! రా,' అని పిలిచేవాడు. నన్ను లోపలికి తీసికొనిపోయి కాఫీయో, టిఫినో నాకు పెట్టడానికి ప్రయత్నించేవాడు. ఈ దృశ్యకల్పితమైన వస్తువులు నన్ను ఆకర్షింపజాలవని గుర్తించాడు. అన్నీ నాదగ్గరనే ఉంటున్నాయి. అంతకు పూర్వం నేనాయనను 'సార్,' అని పిలిచేవాడిని. కాని, ఆనాటినుండి 'రమణా' అని పిలుస్తూవచ్చాను. "నీవు నాకు టీచర్‌వు కాదు, నేను నీకు శిష్యుడను కాదు. గురుశిష్యుల సంబంధము కేవలం

srisathyasaivachanamrutam

ప్రాకృతమైనది. కంటికి కనిపించే దృశ్యములు, చెవులకు వినిపించే శబ్దములన్నీ ప్రాకృతమైనవి. ఇంద్రియములన్నీ కనిపించేవాటిగురించే చెబుతున్నాయిగాని, కనిపించని దాని గురించి చెప్పడం లేదు. ఈ దృశ్యమునకు అతీతమైనదానిగురించి నీవు వెతకాలి," అని చెప్పాను. ఆనాటినుండి నేను ఎక్కడికి వెళ్ళినా ఇవే మాటలు!

"ప్రకృతి సంబంధమైన వస్తువులన్నీ మార్పుచెందునవేగాని, శాశ్వతమైనవి కావు. అదృశ్యమయ్యే వస్తువులను సత్యమైనవని మీరు భావిస్తున్నారు. ఇదే మీరు చేస్తున్న పెద్ద పొరపాటు," ఈవిధంగా వారికి వేదాంతము బోధించాను. హెచ్.ఎస్. వెంకటరమణ శేషమరాజుతో, "మీరు ఆందోళన చెందకండి. ఇతను ఆధ్యాత్మికతత్త్వంలో చాలా లోతుగా వెళుతున్నాడు. గుర్తించడానికి ఎవరి తరమూ కాదు. కొంత టైమ్ ఇవ్వండి," అన్నాడు. అప్పటివరకు హెచ్.ఎస్. రమణ నన్ను 'రాజూ' అని పిలిచేవాడు. కాని, అప్పటినుండి 'గురూజీ' అని పిలవడం ప్రారంభించాడు. 'గురూజీ' అంటూ నా పాదములు పట్టుకొని ప్రార్థించాడు. ఇంత పెద్ద చదువరి ఆ పిల్లవాని పాదాలు పట్టుకుంటున్నాడే, అని అందరూ ఆశ్చర్యపడ్డారు. అప్పుడాయన, **"నేనే కాదు, మీరే కాదు, ఈ ప్రపంచమంతా ఇతని పాదాలు పట్టే సమయం వస్తుంది,"** అని చెప్పాడు.

ప్రక్కింటిలో రామనారాయణశాస్త్రి అనే ఒక జ్యోతిష్కుడు ఉండేవాడు. ఆయనను పిలిపించి నేను మాట్లాడిన విషయాలను ఆయనతో చెబుతూవచ్చారు. ఆయన వింటూ వింటూ కంటిధారలు కార్చాడు. ఆ కంటిధారలు నేరుగా సాయిబాబా పాదాలపైన పడ్డాయి. ఆనాటినుండి ఉరవకొండలో అందరూ నాకు 'సత్యసాయిబాబా' అని పేరు పెట్టారు. ఈ పేరు క్రొత్తదేమీ కాదు, పాతదే! ఈ దేహము పేరు సత్య. చూపే దృశ్యములన్నీ సాయిబాబా దృశ్యములు. కాబట్టి, రెండూ చేర్చి 'సత్యసాయిబాబా' అని పేరుపెట్టారు. సత్యాన్ని చాటే నిమిత్తమై నేను వచ్చానని చెప్పాను. "నీవు సాయిబాబావని ఎట్లా చెప్పగలవు?" అని ఒకరు ప్రశ్నించారు. వెంటనే అక్కడున్న ఒక బుట్టలోనుండి కొన్ని పూలు తీసి నేలపై చల్లాను. ఆ పూలు 'సాయిబాబా' అనే అక్షరాలుగా ఏర్పడ్డాయి. అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. ఎవరికీ నోట మాట రాలేదు. నేను చెప్పాను, "ఇది నేను పెట్టుకున్న పేరు కాదు, మీరు పెట్టిన పేరే! నాకొక ప్రత్యేకమైన పేరే లేదు."

sri sathyasai vachanamrutam

**నేను సాయిని తెలియుము నిక్కముగను**
**మమత బాయుము యత్నములు మానుకొనుము**
**బాసె నాకు మీతోటి బాహ్య సంబంధమింక**
**కాదు నన్బట్ట ఎటువంటి ఘనునికైన**

అని పలికి నేను లేచి వెళ్ళాను. రమణ, శాస్త్రి మొదలైనవారంతా నన్ను ఆపడానికి ప్రయత్నించారు. "ఈవిధంగా మీరు ప్రయత్నాలు చేయకండి. నాకు కావలసింది బాహ్యమైన ప్రవర్తన కాదు. మీలో మానసికసంబంధమైన పరివర్తన రావాలి. మీ యందున్న సత్యతత్త్వమును నిరూపించేందుకే నేను వచ్చాను. నేను ఈ దేహము కాదు. కాబట్టి, నన్ను పట్టుటకు ఎవరికీ చేతకాదు. నన్ను అనుసరించండి. అనుసరిస్తే మీకు సత్యం తెలుస్తుంది," అని చెప్పాను.

అణువునుండి ఘనమువరకు నిండివున్నది ఆత్మతత్త్వమే. అణువులో అణువుగా, ఘనములో ఘనముగా కనిపిస్తుంది. అణువు, ఘనములయొక్క ఏకత్వమే సత్యము. మీరు దీనిని విచారణ చేయండి. పూర్వము రమణ మహర్షి తన ఆశ్రమమునకు వచ్చినవారిని అడిగేవాడు, "నాయనా! నీవు ఎవరు?" అని. నీవు ఎవరో నేను వారే! నేను ఎవరో వారు నీవే! నేను, నీవు ఒక్కటైనప్పుడు ఇంక భేదమేమున్నది?

**సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు**
**మేటివస్తువునందున మేటియగుచు**
**అంతటను సర్వసాక్షియై యలరునట్టి**
**ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మయగును**

ఆత్మకు ఒక ప్రత్యేకమైన రూపము లేదు. నేను అప్పుడప్పుడు చెబుతుంటాను, "నాయనా! నీవు ఒకడివి కాదు, నీలో ముగ్గురున్నారు. 1. నీవనుకునే నీవు (దేహము), 2. ఇతరులనుకునే నీవు (మనస్సు) 3. అసలైన నీవు (ఆత్మ)." ఆత్మ అనగా చైతన్యశక్తి. ఇది సర్వులయందుంటున్నది.

ఆరోజుల్లో సాయిబాబా అంటే ఎవరికీ తెలియదు. అవతారప్రకటనానంతరం నేను

sri sathyasai vacharamrutam

ఉరవకొండనుండి పుట్టపర్తికి వచ్చినప్పుడు గ్రామస్థులు మొట్టమొదటి సారిగా 'సాయిబాబా' అనే పేరు విని నేను మహమ్మదీయుల పేరు పెట్టుకున్నానని అనుకున్నారు. కాని, సాయిబాబా కులమతాలకు అతీతుడు. 'ఎందు చూసిన అందే కానబడును.'

విష్ణువే గొప్పని వైష్ణవులనుచుండ
శంభుండు గొప్పని శైవులనగ
గణపతి గొప్పని గాణపతులు పల్క
శారద గొప్పని చదువరులన
అల్లా ఘనుండని ఆ తురకలు చెప్ప
శాక్తేయులందరు శక్తియనగ
నేను గొప్పయటంచు నాదు భక్తులు చెప్ప
అందరొక్కటెయని కొందరనగ
సర్వమత సమ్మతమ్ముగ సత్యమైన
బ్రహ్మమొక్కటెయని మీరు పలుకవలయు
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

దివ్యత్వమునుగురించి ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా చెప్తూ వచ్చారు. అయితే, అన్ని రూపనామములందు ఉన్న ఆత్మతత్త్వము ఒక్కటే! దీనిని ఈనాడు ప్రపంచమునకు అర్థమయ్యేరీతిగా చెప్పాలి.

చూడండి, అక్కడ కొన్ని ఇళ్ళు కనిపిస్తున్నాయి. ముందు కనిపించేది వరండా. లోపల గోడ, దానివెనుక ఒక రూము. ఇంకా లోపలికి పోతే వంట గది, ఇంకా కొంచెం లోపలికి పోతే స్నానాలగది. ఒక్కొక్క గదికి ఒక్కొక్క పేరు. ఈ పేర్లన్నీ ఎక్కడినుండి వచ్చినాయి? గదులను వేరువేరుగా విభాగం చేయడంవల్లనే ఆ పేర్లు వచ్చాయి. అదేవిధముగా, దేహాభిమానముచేత ఒకరు తల్లి అని, ఒకరు తండ్రి అని, ఒకరు సోదరుడని వేర్వేరు సంబంధబాంధవ్యాలను ఏర్పర్చుకుంటున్నారు. ఇవి మీరు కల్పించుకున్నవే! ఈ

srisathyasaivachanamrutam

అడ్డుగోడలను తీసివేయండి. అప్పుడే మీరు ఏకత్వమైన దివ్యత్వమును దర్శించగలరు. దివ్యత్వమునకు ఒకరు ఆత్మ అని, ఒకరు బ్రహ్మ అని, ఒకరు విష్ణువని పేర్లు పెట్టారు. కాని, దివ్యత్వమునకు ఒక ప్రత్యేకమైన పేరుగాని, రూపముగాని లేదు. ఏ రూపముగా భావిస్తే ఆ రూపమును ధరిస్తుంది. రాముడుగాని, కృష్ణుడుగాని ఆయా పేర్లు పెట్టుకొని వచ్చారా? "కర్షతీతి కృష్ణః", అందరినీ ఆకర్షించేవాడు కనుకనే, ఆయనను కృష్ణ దన్నారు. ఆనందస్వరూపుడు కృష్ణుడు.

**నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమలమచలం సర్వధీ సాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణరహితం....**

ఇటువంటి ఆత్మతత్త్వమునకు ఏ పేరు పెట్టగలము? ఆత్మతత్త్వము సర్వులయందు ఉన్నదనే సత్యాన్ని గుర్తింపజేసే నిమిత్తమై నేను వచ్చానని చెప్పాను. శేషమరాజు, "నీవెవరు?" అని ప్రశ్నించాడు. నేను చెప్పాను, "నీవు 'సత్యా' అని పిలుస్తున్నావు. నేను సత్యాన్ని. నీవు 'బ్రదర్' అని పిలిస్తే, నేను బ్రదర్‌ని. ఎవరు ఏ పేరుతో పిలిస్తే ఆ రూపాన్ని ధరిస్తాను. సత్యం చెప్పాలంటే, ఎవరికీ నాతో ప్రాపంచికమైన సంబంధము లేదు. ఏ పేరుతో పిలిచినా పలుకుతాను. 'సాయీ' అని పిలిచినా 'యెస్' అంటాను. 'బాబా' అని పిలిచినా 'యెస్' అంటాను. ఏ పేరుతో పిలిచినా నాకు ఒక్కటే. ఇవన్నీ పెట్టిన పేర్లేగాని, పుట్టిన పేర్లు కావు," అని చెప్పాను.

ఈ దేహము ఉరవకొండలో చదువుతున్నప్పుడు క్లాసురూమ్‌లో ఒక డెస్కువద్ద ముగ్గురం కూర్చొనే వారము. నేను మధ్యలో కూర్చుంటే రమేశ్, సురేశ్‌లు నాకు ఇరువైపుల కూర్చునేవారు. ఆ ఇద్దరు పిల్లలకు స్వామి అంటే ప్రాణము. అయితే, వారికి చదువు సరిగా రాదు. క్లాసులో నేనే వారికి సహాయం చేస్తూవచ్చాను. ఒక పర్యాయం ఇ.ఎస్.ఎల్.సి. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ వచ్చాయి. రమేశ్, సురేశ్‌లు చాలా భయపడ్డారు. "రాజూ! నీవే మాకు దిక్కు," అన్నారు. "భయపడితే ప్రయోజనమేమిటి? ధైర్యంగా ఉండాలి," అని నేను చెప్పాను. పరీక్షల్లో నన్ను సహాయం చేయమని కోరారు. కోరినవారికి కాదని చెప్పడానికి వీలుకాదు.

sri sathyasai vahamrutam

తప్పక సహాయం చేస్తానని మాటిచ్చాను. పరీక్ష రోజున మేము ఒకరికొకరం చాలా దూరంగా కూర్చోవలసి వచ్చింది. మా రూల్ నెంబర్లు ఆవిధంగా వచ్చాయి. "రాజు దగ్గరుంటే మాకు సహాయం చేసేవాడు. కాని, దూరంగా కూర్చున్నాడే! ఇప్పుడేమి చేసేది?" అని వారు కంటిధారలు కారుస్తున్నారు. "భయపడకండి, ధైర్యంగా ఉండండి," అని నేను కనుసైగలు చేశాను. దైవాన్ని నమ్మకుండా చెడినవారలు కోట్లకొద్దీ ఉన్నారు. కాని, నమ్మి చెడినవారు ఒక్కరూ లేరు. నమ్మినవారు తప్పకుండా విజయం సాధిస్తారు. కాని, ఈనాటి మానవుడు దైవాన్ని నమ్మడం లేదు. "నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి మనుజు లవనియందు."

పరీక్షాహాలులో పేపర్లు వాళ్ళే ఇచ్చారు. మేము ఏదీ తీసుకువెళ్ళడానికి వీల్లేదు. రమేశ్, సురేశ్‌లు వారివారి స్థానాల్లో కూర్చుని ఏదో వ్రాస్తున్నట్లు నటించారు. మొట్టమొదట ఇచ్చిన పేపరు మీద చక్కని ఆన్సర్లు స్పీడుగా వ్రాసేశాను. దానిపైన నా నెంబరు, పేరు వ్రాసి మడతపెట్టి ప్రక్కన పెట్టుకున్నాను. మరొక పేపరు తీసుకొని రమేశ్ హేండ్ రైటింగుతో చక్కని జవాబులు వ్రాసి, దానిపైన అతని పేరు, నెంబరు వ్రాశాను. అదేరీతిగా, ఇంకొక పేపరుపై సురేశ్ హేండ్ రైటింగుతో చక్కని జవాబులు వ్రాశాను. ఈ మూడు పేపర్లను నాదగ్గరే పెట్టుకున్నాను. ఇంతలో బెల్లు కొట్టారు. "టైమైపోయింది. పేపర్లు ఇచ్చేయండి," అని టీచర్లు తొందరపెట్టారు. రమేశ్, సురేశ్‌లు నావైపు చూస్తున్నారు. వాళ్ళని బయటికి పొమ్మని సంజ్ఞ చేశాను. పిల్లలు ఒకేసారి గుంపుగా లేచారు. ఆ హడావుడిలో ఎవరు ఏ పేపరు పెడుతున్నారో కనిపెట్టడానికి వీలుకాదు. రమేశ్, సురేశ్‌లు బయటికి పోయారు. మా ముగ్గురి పేపర్లను నేనే తీసుకువెళ్లి టైబుల్‌పైన పెట్టాను. తరువాత పరీక్షా ఫలితాలు వచ్చాయి. మా ముగ్గురికి మాత్రమే ఫస్ట్‌క్లాసు వచ్చింది. రమేశ్, సురేశ్‌లకి కూడా ఫస్టుక్లాసు రావడం టీచర్లకు మరియు పిల్లలకు విస్మయం కలిగించింది. ఆ పిల్ల లిద్దరూ నాదగ్గరకు వచ్చి, "ఎవరైనా ఏదైనా ప్రశ్న అడిగితే మేము ఏమి జవాబు చెప్పేది?" అని ఏడ్చారు. "అప్పుడు జవాబులు వచ్చాయిగాని, ఇప్పుడు రావటం లేదని చెప్పండి. ఈవిధంగా చెబితే నేను మీవాడను, మీరు నావారు," అన్నాను. వాళ్ళు నేను చెప్పినట్లుగానే చేశారు. ఎవరడిగినా మేమే వ్రాశామన్నారు. మా రూల్‌నెంబర్ల ప్రకారం పరీక్షా హాలులో

sri sathyasai vahamrutam

ఒకరికొకరం చాలా దూరంగా కూర్చున్నాం. కాబట్టి, ఒకరికొకరు చెప్పుకోవడానికిగాని, ఒకరిని చూసి ఒకరు వ్రాయడానికిగాని వీల్లేదు. ఎవరి పేపరు వారి హేండ్ రైటింగ్‌లోనే ఉంది కాబట్టి, ఎట్టి సందేహానికీ అవకాశం లేదు. క్లాసులో మిగిలిన పిల్లలకి మాపైన అసూయ కలిగింది. ప్రజలు మా ముగ్గురికీ పూలదండలు వేసి ఘనంగా ఊరేగించారు. "సత్యం ఎంత గొప్పవాడు! ఇంత శక్తి ఇతనికి ఎక్కడినుండి వచ్చింది?" అని అందరూ ఆశ్చర్యపోయారు.

ఆరోజుల్లో నేను చక్కని కవిత్వం వ్రాసేవాడిని. ఒకనాడు కొట్టె సుబ్బన్న అనే వ్యాపారి ఒకతను నా దగ్గరికి వచ్చి తన అంగడిలో 'బాలభాస్కర' అనే ఒక క్రొత్త మందు వచ్చిందని, దానిపై ఒక పాట వ్రాయ వలసిందని కోరాడు. "రాజూ, నీకు ఏమి కావలసినా ఇస్తాను. డబ్బు కావలసినా ఇస్తాను, ఏవైనా పదార్థాలు కావలసినా ఇస్తాను. ఈ మందుపైన ఒక మంచి పాట వ్రాసిపెట్టు. దానిని పదిమంది పిల్లలకు నేర్పించి రోడ్లంతా త్రిప్పిస్తాను. అది ఆ మందుకు చక్కని అడ్వర్‌టైజ్‌మెంటు అవుతుంది," అన్నాడు. "అయ్యా, నేను నా కవిత్వాన్ని అమ్ముకునేవాడిని కాను. మందు గురించి చెప్పండి, పాట వ్రాసి ఇస్తాను," అన్నాను. ఆ మందుయొక్క గుణములన్నీ నాకు వ్రాసిచ్చాడు. అతను కోరినట్లుగా ఈ పాట కూర్చాను.

దొరికె దొరికె 'బాలభాస్కర'
బాలకులార! రండి బాలకులార!
కడుపుబ్బరము, కాళ్ళవాపులు,
చేతిమోదలను చెడుగులనుండి
అజాగరూక పోషణనుండి
అజీర్ణ విరేచనములనుండి
అన్నిటికీ ఇది బాగవునండీ
బాలకులార! రండి బాలకులార!
అది ఎక్కడ అని అడిగేరన్నా,
అదిగదిగో కొట్టె సుబ్బన్న
అంగడియందే దొరకును అన్నా

sri sathyasaivacharamrutam

## తేదీ 21.10.2003, సాయికుల్వంత్ సభామండపం

పండిత శ్రీగోపాలాచార్యుల
పావనమైన టానిక్కన్నా ....

ఆ పాట వినేటప్పటికి అతను ఆనందంతో మైమరచి ఇంటికి పరుగెత్తుకొని వెళ్ళి ఒక బుట్టెడు లడ్డులు తీసుకు వచ్చాడు. “నా వద్దకు తీసుకురావద్దు. అందరికీ పంచిపెట్టు,” అని చెప్పాను. ఈ పాట అందరికీ తెలిసిపోయింది. ఎక్కడ చూసినా పాడుకునేవారు. కొట్టె సుబ్బన్న పేరుకూడా చాలా వ్యాప్తి అయిపోయింది. ఈవిధమైన ప్రచారంచేత ‘బాలభాస్కర’ మందు బాగా అమ్ముడుపోయింది.

నేను ఉరవకొండను విడిచిపెట్టిన తరువాత రమేశ్, సురేశ్‌లు నా వియోగాన్ని భరించుకోలేకపోయారు. కన్న తల్లిదండ్రులకు, సోదరీసోదరులకు సైతం అంతటి ప్రేమ రాదు. అటువంటి ప్రేమ వారిలో ఆవిర్భవించింది. నేను బస్సు ఎక్కేటప్పటికి స్కూలు పిల్లలు ఒకటే ఏడ్పు! రమేశ్ అనే పిల్లవాడు పరుగెత్తుకొని పోయి బావిలో పడి మరణించాడు. సురేశ్‌కి పిచ్చిపట్టిపోయింది. అతని నోటినుండి ‘రాజూ, రాజూ,’ అనే పదము తప్ప మరొకమాట లేదు. తల్లిదండ్రులు ఆ పిల్లవానిని అనేకమంది డాక్టర్లకు చూపించారు. కాని, ఫలితం లేకపోయింది. చివరికి తండ్రి నావద్దకు వచ్చి ప్రార్థించాడు, ‘ఒక్కతూరి వానికి దర్శనమివ్వండి,’ అని. నేను వెళ్ళి వానిని చూశాను. ‘రాజూ, రాజూ’ అని కలవరిస్తున్నాడు. ఎవ్వరినీ చూడడం లేదు. ‘సురేశ్! రాజును వచ్చాను, చూడు,’ అన్నాను. తల ఎత్తి చూశాడు. శాశ్వతంగా కన్ను మూశాడు. ఎవరికైనా చావు, పుట్టుకలు తప్పునవి కావు. పుట్టినది గిట్టక తప్పదు, గిట్టినది పుట్టక తప్పదు. ఇది లోక సహజము.

చనిపోయిన రమేశ్, సురేశ్‌లు కుక్కలుగా జన్మించి తిరిగి నావద్దకు వచ్చారు. నేను పాత మందిరంలో ఉండగా బెంగళూరునుండి ఒక ఆఫీసరు ఆ రెండు కుక్కపిల్లల్ని తీసుకు వచ్చాడు. వాటికి ‘జాక్ అండ్ జిల్’ అని పేర్లు పెట్టాను. ఆ రెండూ పాతమందిరంలో ఎప్పుడూ నావెంట తిరుగుతూ ఉండేవి. ఒకనాడు మైసూరు మహారాణి వచ్చింది. ఆమెకు మడి ఆచారాలు ఎక్కువ. ఎవ్వరినీ ముట్టేది కాదు. ఒకరు ముట్టిన వస్తువును కూడా తాను ముట్టేది కాదు. పాలు పితకాలంటే ముందు ఆవుకు స్నానం చేయించవలసిందే! అంత చాదస్తం ఆమెకు! ఆరోజుల్లో పుట్టపర్తికి రోడ్డుసౌకర్యం లేదు. అందుచేత, ఆమె

srisathyasaivachanamrutam

కర్నాటనాగేపల్లివద్ద కారు దిగి పుట్టపర్తికి కాలినడకన వచ్చింది. ఇతరులు నడచినచోట నడవడం ఆమెకిష్టం లేదు. అందుచేత, తనవెంట నాల్గు చెక్కపలకలను తెచ్చుకుంది. వాటిపైన అడుగులు వేసుకుంటూ మందిరానికి వచ్చింది. స్వామి దర్శనం చేసుకొని ఎంతో ఆనందించింది. భోజనం చేసిన తరువాత డ్రైవరు కారువద్దకు వెళ్ళాలి. అప్పటికి చీకటి పడింది. దారిలో విద్యుద్దీపాలు లేవు. అందుచేత డ్రైవర్‌కి సహాయంగా నేను జాక్‌ని పంపించాను. ఆ రాత్రి బాగా వర్షం కురిసింది. డ్రైవరు తలుపులు వేసుకొని కారులో పడుకున్నాడు. కారు క్రింద జాక్ పడుకుంది. తెల్లవారి లేచిన తరువాత డ్రైవరు కారును స్టార్ట్ చేసి కొంచెం ముందుకు నడిపాడు. దాని టైరు క్రిందపడి జాక్ నడుం విరిగిపోయింది. ఇంక, ఆ బాధను భరించలేక అది ఏడ్చుకుంటూ మందిరానికి బయలుదేరింది. చిత్రావతి ఇసుకలో తన శరీరాన్ని ఈడ్చుకుంటూ, అరుచుకుంటూ వస్తున్నది. మందిరం గేటుదగ్గర చాకలి సుబ్బన్న అనే 'వాచ్‌మెన్' ఉండేవాడు. అతను లోపలికి వచ్చి, "స్వామీ, మన జాక్ నడుం విరిగిపోయింది. ఏడ్చుకుంటూ వస్తోంది," అన్నాడు. నేను గేటు దగ్గరకు పోయేటప్పటికి అది నా పాదాలపై పడింది, ప్రాణం విడిచింది. జాక్ పోయిన నాటినుండి జిల్ తిండి మానేసింది. కొద్ది రోజులకి అదికూడా పోయింది. ఆ రెండింటినీ పాతమందిరం వెనుక సమాధి చేయించి అక్కడొక బృందావనం కట్టించాను. ఈవిధంగా రమేశ్, సురేశ్‌లు స్వామిదగ్గర ఉండాలని అంత తపస్సు చేసి, మరణించిన తరువాత కుక్కలుగా జన్మించి, నాదగ్గరనే ఉండి చివరికి నాలోనే ఐక్యమయ్యారు.

బాల్యంలో నేను చక్కని పాటలు వ్రాసి, పిల్లలచే పాడించి గ్రామస్థులకు ఆనందం కల్గించేవాడిని. ఒకనాడు బుక్కపట్నం నుండి నారాయణరెడ్డి అనే ఒక రాజకీయ నాయకుడు వచ్చి, "బాబూ! నీవు మంచి కవిత్వం వ్రాస్తావట. మన వీరులపైన మంచి కవిత్వం వ్రాసిస్తే మేము పేపర్లో వేసుకుంటాం," అన్నాడు. వాళ్ళు ఒక సభ ఏర్పాటు చేసుకున్నారు. అప్పుడు నేను సభావేదికపై ఉయ్యాల తొట్టెలో ఒక రబ్బరుబొమ్మను పెట్టి ఊపుతూ ఇలా ఒక పాటను కూర్చి పాడాను:



sri sathyasai vahini amrutam

ఏడువకు పసిబాల ఏడువకు తండ్రీ!
ఏడిస్తే నిను భరతవీరుడనరయ్యా...జో...జో...
హంతకుడు హిట్లరు అమర రష్యాపై
దండెత్తి వచ్చెనని జడిసి ఏడ్చితివా...జో...జో...
హిట్లరును చంపుటకు ఎఱ్ఱసైన్యంబు
వీరుడౌ స్టాలిను కలరు ఏడువకు...జో...జో...
ఇంకెందుకుర నాన్న అట్టులేడ్చెదవు?
ప్రజలకైక్యత లేదటంచు ఏడ్చితివా?
ఐక్యతగ ప్రజలంత చేరి పోరాడి
స్వాతంత్ర్యమును పొందగలరు ఏడువకు
... జో... జో...

ఈ హిట్లరు, స్టాలిను ఎవరు? ఎఱ్ఱసైన్యం ఏమిటి? ఇవన్నీ ఈ పిల్లవానికి ఎట్లా తెలుసు? అని జనం చాలా ఆశ్చర్యపడ్డారు. ఈ పాటను కరపత్రములలో ముద్రించి పల్లెపల్లెలో పంచిపెట్టారు. సభ దిగ్విజయంగా జరిగింది. వాళ్ళు నాకు షర్టులు, నిక్కర్లు, టవల్స్ తీసికొని వచ్చారు. వారి ఎదురుగానే నేను వాటిని పిల్లలకు పంచేశాను. "నేను ప్రతిఫలంకోసం వ్రాయలేదు. మిమ్మల్ని ఉత్సాహ పరచాలని వ్రాశాను," అని చెప్పి వారిని పంపించేశాను. అప్పటినుండి అనేకమంది నాయకులు వచ్చి తమతమ పార్టీలగురించి పాటలు వ్రాయవలసిందని కోరుతూ వచ్చారు. నేను చెప్పాను: **"ఈవిధంగా వ్రాయడంవల్ల పార్టీలలో చాలా విభేదాలు ఏర్పడతాయి. కాబట్టి, నేను వ్రాయను. నాకు ఏ పార్టీతోనూ సంబంధం లేదు. అన్ని పార్టీలూ నావే! అందరూ నావారే! నేను అందరి వాడినే!"** అప్పటినుండి నేను వ్రాయడం మానివేశాను. అసలు ఇప్పుడు భజన పాటలుకూడా నేను వ్రాయడం లేదు. సనాతనసారథిలో వ్యాసాలు కూడా వ్రాయడం లేదు. పాపం, కస్తూరి నాదగ్గరకు వచ్చి "స్వామీ, మీ పేరుంటేగాని ఈ సనాతన సారథి దిగ్విజయం కాదు. మీరు తప్పక వ్రాయాలి," అని ప్రార్థించేవాడు.

స్కూలులో విద్యార్థులు నన్ను ప్రాణసమానంగా ప్రేమించేవారు. నేనుకూడా



srisathyasaivachanamrutam

విద్యార్థులతో చాలా ప్రేమగా ఉండేవాడిని. ఇంట్లో చేసిన వడలు, పకోడాలు తీసికొనివెళ్ళి వారికి పెట్టేవాడిని. నా ప్రేమతత్త్వమును చూసి రమేశ్, సురేశ్‌లు తమ ప్రాణాలు నాకు అర్పితం చేశారు. "స్వామీ, పరీక్షలు మీరు వ్రాసి ఆ పిల్లల పేర్లు ఎలా పెట్టారు?" అని ఒకరు అడిగారు. నేను చెప్పాను, "రమేశ్ కూడా నాపేరే, సురేశ్ కూడా నా పేరే!" అని. ఇంక, వారేమి జవాబు చెప్పగలరు? ఈవిధంగా నా చరిత్రను చెప్పుకుంటూ పోతే చాలా పెద్దదైపోతుంది.

విద్యార్థులంటే నాకు చాలా ఇష్టం. విద్యార్థులకు కూడా స్వామి అంటే ఎంతో ప్రేమ. ప్రతి విషయానికి నాదగ్గరకు వస్తారు. నిన్నకూడా ఒక రీసెర్చి స్కాలర్ సహాయంకొరకు నాదగ్గరకు వచ్చాడు. అతను మహాభారతంపై 'థీసిస్' వ్రాస్తున్నాడు. ఇప్పుడుకూడా అతను ఇక్కడే వరండాలో కూర్చొనివున్నాడు. తనకు మనసులో ఏది సత్యమని తోస్తే అది వ్రాయమని చెప్పాను. ఈ పిల్లలంతా 'స్వామియే తల్లి, స్వామియే తండ్రి, స్వామియే సర్వము,' అని భావిస్తారు. స్వామిని 'సాయిమాతా! సాయిమాతా!' అని ప్రార్థిస్తారు. వారు, 'తల్లీ!' అని పిలిచినప్పుడు వారి ప్రార్థనను మన్నించకుండా ఉండడానికి వీలౌతుందా! 'యద్భావం తద్భవతి' కాబట్టి, నేనుకూడా వారిపై తల్లిప్రేమను కురిపిస్తున్నాను. వారి ప్రేమే నాలో ప్రతిబింబిస్తున్నది, అంతే! ఇది తల్లీబిడ్డల ప్రేమ తప్ప వేరు కాదు. మీరు తల్లిగా భావిస్తే నేను తల్లిగానే ఉంటాను, తండ్రిగా భావిస్తే తండ్రిగానే ఉంటాను. ఎవరు ఏవిధంగా భావిస్తే వారితో ఆవిధంగా సంచరిస్తాను.

**(తేదీ 21.10.2003, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasaivachanamrutam